క్లుప్తంగా

పాతిక వేలకు పాపను అమ్మేసిన కసాయి తండ్రి

• ఆర్కేపేట పోలీసుల విచారణ

పళ్లిపట్టు: పాతిక వేలకు పాపను అమ్మేసిన తండ్రి, కొనుక్కున్న వ్యక్తి బాతులు మేపే వెట్టిచాకిరి పనులు చేస్తున్న పదేళ్ల చిన్నారి రాత్రి సమయంలో గ్రామంలోకి పరుగులు తీయడంతో గ్రామస్తులు రక్షించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ సంఘటన ఆర్కేపేట ప్రాంతంలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలు..ఆంధ్రాలోని నెల్లూరు జిల్లాకు చెందిన రమణయ్య దంపతులకు 10 మంది పిల్లలలో ముగ్గురు మగపిల్లలు ఏడుగురు అమ్మాయిలు. వారిలో పెద్ద అమ్మాయికి 27 ఏళ్లు కాగా చిన్న పాపకు రెండేళ్లు. రమణయ్య భార్య అనారోగ్యం బారిన పడినట్లు తెలుస్తున్నది. దీంతో పిల్లలను తిరుపతికి తీసుకొచ్చి బిక్షాటనకు పెట్టినట్లు తెలుస్తున్నది. ఈ క్రమంలో చిత్తూరు జిల్లా నగరికి చెందిన బాతులు పెంచి పోషించే బాలాజీ అనే వ్యక్తి తిరుత్తణి శివారులో బాతులు మేపుకుంటూ వుండే సమయంలో రమణయ్యతో పరిచయం ఏర్పడింది. ఈ సందర్భంగా బాతులు మేపేందుకు వీలుగా తన ఐదవ కూతురు మల్లిక (10)ను బాతులు మేపేందుకు తీసుకెళ్లమని అందుకు తనకు రూ. 25 వేలు ఇవ్వాలని అడిగినట్లు, అందుకు అంగీకరించిన బాలాజీ రూ. పాతికవేలు ఇచ్చి తనవెంట పదేళ్ల పాపను తీసుకెళ్లాడు. నగరిలో కొద్ది రోజులు బాతులు మేపిన తరువాత తమిళనాడులోని పళ్లిపట్టు సమీపం ఆర్కేపేట మండలంలోని మీసరగాండాపురం అనే గ్రామంలో చెరువుకట్ట వద్ద టెంటు వేసి బాతులు మేపుకుంటున్న సమయంలో వారితో వున్న చిన్నారి సోమవారం రాత్రి సమయంలో కేకలు వేస్తూ సమీపంలోని గ్రామంలోకి పరుగులు తీసింది. గ్రామస్తులు చిన్నారిని రక్షించి పోలీసులకు అప్పగించారు. ఆర్కేపేట పోలీసులు కేసు నమోదు చేసి చిన్నారిని తిరువళ్లూరులోని చిన్నారుల సంక్షేమ వసతి గృహానికి తీసుకెళ్లి స్థానిక డీఎస్పీ కేసు విచారణ చేస్తున్నారు.

విస్తారంగా వరి సాగు



విజయపురం: మండలంలో వరి విస్తారంగా సాగవుతోందిఇ. ఇప్పటికే పన్నూరు, మాధవరం , అలపాకం, బూచివానత్తంలో రైతులు వరి సాగు చేయగా, కేవీపురం, గంగమాంబపురం, కాళికాపురం తదితర గ్రామాల్లో వరి సాగుకు నాట్లు సిద్ధం చేస్తున్నారు. ఈ ఏడాది వర్షాలు పడి గుంటలు, చెరువులు నిండడంతో బోర్లు, బావుల్లో నీటి శాతం పెరిగింది. గతంలో ఆరుతడి పంటలు సాగు చేసిన రైతులు సైతం వరి సాగు చేస్తున్నారు. ఇప్పటికే 230 హెక్టార్లలో వరి సాగు కాగా, మరో 150 హెక్టార్లలో వరి సాగులోకి రానున్నదని తెలిపారు.

అక్రమంగా కలప రవాణా



పన్నూరులో అక్రమంగా కలప తరలింపు

విజయపురం: అక్రమ కలప రవాణా యథేచ్ఛగా కొనసాగుతోంది. కొంతమంది కలప వ్యాపారులు అక్రమ సంపాదనే ధ్యేయంగా ఇష్టానుసారంగా చెట్లను నరికి ఇటుక బట్టీలకు, బాయిలర్లకు తరలిస్తున్నారు. ఎలాంటి అనుమతులు తీసుకోకుండా కొంత మంది అటవీ అధికారులతో చీకటి ఒప్పందాలు కుదుర్చుకొని వాల్టా చట్టానికి తూట్లు పొడుస్తున్నారు. హోటళ్లకు, ఇసుక బట్టీలకు, బాయిలర్లకు తరలుతున్నా పట్టించుకునే నాథుడే లేడు.



గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్య స్థాపనకు వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వం కృషి చేసింది. గ్రామ, వార్డు సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థలను ఏర్పాటు చేసి ఉద్యోగులు, వలంటీర్లను నియమించి ప్రభుత్వ పాలనను ప్రజలకు చేరువ చేసింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆ వ్యవస్థకు తూట్లు పొడుస్తోంది. ఇప్పటికే వలంటీర్ వ్యవస్థను మాయం చేసిన కూటమి సర్కార్.. సచివాలయాల వ్యవస్థను కూడా నిర్వీర్యం చేసేందుకు కుట్రలు చేస్తుంది. – నగరి

నాడు సేవలు.. నేడు నిర్వీర్యం

• కూటమి పాలనలో నిరామయంగా సచివాలయ వ్యవస్థ
• 7 నెలలుగా తెరుచుకోని పింఛన్, రేషన్ కార్డు, ఆరోగ్యశ్రీ కార్డు వెబ్‌సైట్‌లు

మండలం/ మున్సిపాలిటీ	సచివాలయాలు
నగరి మున్సిపాలిటీ	17
నగరి మండలం	13
పుత్తూరు మున్సిపాలిటీ	13
పుత్తూరు మండలం	10
విజయపురం మండలం	12
వడమాలపేట మండలం	13
నింద్ర మండలం	12
మొత్తం	90

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సచివాలయాల ద్వారా 541 సేవలు అందేవి. నేడు ఆ పరిస్థితి లేకుండా పోయింది. అంతా గందరగోళంగా మారింది. ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు దాటినా కొత్త రేషన్ కార్డులు, కొత్త పింఛన్లు, ఆరోగ్యశ్రీ కార్డుల వెబ్‌సైట్లు ఇంత వరకు తెరచుకోలేదు. ఫలితంగా అనేక మంది లబ్ధిదారులకు ప్రభుత్వం అందించే అరాకొరా సంక్షేమ పథకాల ఫలాలు కూడా అందక అవస్థలు పడుతున్నారు.

సచివాలయ ఉద్యోగులే దిక్కు

నాడు కూటమి ప్రభుత్వం నేతలు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సచివాలయ ఉద్యోగులపై వివక్షతో అనేక విమర్శలు చేశారు. అవహేళనగా మాట్లాడారు. కానీ ప్రస్తుతం కూటమి సర్కారు పింఛన్లు పంపిణీకి సచివాలయ ఉద్యోగులే పెద్ద దిక్కయ్యారు. అంతేకాక ఇటీవల కూటమి ప్రభుత్వం చేపట్టిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో కూడా స్టిక్కర్లు అతికించే దగ్గర నుంచి, ఇంటింటి ప్రచారం వరకు వీరినే ఉపయోగించి వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారు. నోటికి వచ్చిన అబద్ధపు హామీలతో నేతలు ప్రజలకు వాగ్దానాలు చేసి గద్దెనెక్కిన కూటమి సర్కార్ సూపర్ సిక్స్ హామీలను తుంగలో తొక్కింది. వాటి అమలుపై ప్రజలు ఎక్కడ నిలదీస్తారో, ప్రశ్నిస్తారోనని రోజుకొక సమస్యను సృష్టించి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోందనే విమర్శలు కూడా వ్యక్తమవుతున్నాయి.

నాడు కళకళ.. నేడు వెలవెల

గత ప్రభుత్వం రెండు వేలకు పైగా జనాభా ఉన్న గ్రామంలో రూ.40 లక్షలతో సచివాలయం, రూ.21 లక్షలతో రైతు భరోసా కేంద్రం, రూ.20.80 లక్షలతోహెల్త్ సెంటర్‌లు ఏర్పాటు చేసింది. కొన్నినెలల క్రితం వరకు వివిధ సంక్షేమ పథకాల అమలుతో ప్రజలు, లబ్ధిదారుల రాకపోకలతో కళకళలాడిన సచివాలయాలు నేడు వెలవెలబోతున్నాయి. నగరి నియోజకవర్గంలో మొత్తం 90 సచివాలయాలు ఉండగా అందులో 1100 మంది సచివాలయ ఉద్యోగులు ఉన్నారు. కూటమి ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేయడంతో సేవలందక ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. కేవలం నెల ప్రారంభంలో పింఛన్లు పంపిణీ మాత్రమే చేయిస్తోంది. ఫించన్లలోనూ కొత్త పెన్షన్లకు, రెండు నెలల క్రితం పెన్షన్ తీస్తూ చనిపోతే వారి భార్యకో, భర్తకో ఇవ్వాల్సిన పెన్షన్‌కు ఆప్షన్ ఆన్‌లైన్‌లో రావడం లేదు. ప్రస్తుతం పెన్షన్ తీస్తూ చనిపోయినవారి కుటుంబ సభ్యులకు మాత్రం పెన్షన్ అందుతోంది. ఇలా సంక్షేమ పథకాల అమలు లేకపోవడం, సేవలు నిలిచిపోవడంతో కార్యాలయాలకు ప్రజలు రాక వెలవెలబోతున్నాయి.

సేవలు స్తంభించాయి



సేవలకు సంబంధిత ఆప్షన్‌లు ఆన్‌లైన్‌లో ఉండడం లేదు. కొత్త పెన్షన్లకు, రేషన్ కార్డులకు, ఆరోగ్యశ్రీ కార్డులకు సంబంధిత సైట్‌లు అన్నీ తెరచుకోవడం లేదు. దీంతో చాలా వరకు సేవలు సచివాలయంలో ఆగిపోయాయి. సర్టిఫికెట్ల జారీ కూడా మునుపటిలా వేగంగా జరగడం లేదు.

\- గోవర్ధన్, గుండ్రాజుకుప్పం దళితవాడ, నగరి మండలం

మునుపటిలా అన్ని సేవలు లేవు



మునుపున్నంత సేవలు సచివాలయాల్లో నేడు లేవు. చాలావరకు ఆగిపోయాయి. పెన్షన్‌దారులు చనిపోతే వారి భర్తకో, భార్యకో ఆ పెన్షన్ ఇచ్చేవారు. ఇలా రెండు నెలల క్రితం వరకు చనిపోయిన పెన్షన్‌దారుల భర్తలకు గానీ, భార్యలకు గానీ పెన్షన్ రాలేదు. సచివాలయాల్లో దానికి ఆప్షన్ లేదని అంటున్నారు. రేషన్ కార్డులకీ ఇదే పరిస్థితి.

\- కైలాసం, నింద్ర, నింద్ర మండలం

మహా కుంభమేళాలో మాజీ మంత్రి పుణ్యస్నానం



పవిత్ర స్నానమాచరిస్తున్న మాజీమంత్రి

నగరి: ఉత్తరప్రదేశ్, ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాలో మాజీ మంత్రి ఆర్కే రోజా పుణ్యస్నానం ఆచరించారు. మంగళవారం పవిత్ర త్రివేణి సంగమంలో స్నానం ఆచరించి గంగమ్మకు పూజలు చేశారు. ఆలోపై శక్తి పీఠాన్ని సందర్శించి పీఠాధిపతి మహంతి యమునపురి ఆశీర్వాదం తీసుకున్నారు.

లంపీస్కిన్ వ్యాధితో జాగ్రత్త



పశువులకు చికిత్స అందిస్తున్న పశువైద్యులు

శ్రీరంగరాజపురం: పాడి పశువులకు వచ్చే లంపీస్కిన్ వ్యాధితో రైతులు జాగ్రత్తగా ఉండాలని పశువైద్యాధికారి శ్రీవిద్య అన్నారు. మండలంలోని పాదలపల్లి గ్రామంలో పశువైద్య శిబిరం నిర్వహించారు. ఆమె మట్లాడుతూ ప్రస్తుతం పశువులకు లంపీస్కిన్ వ్యాధి అధికంగా ఉందని పశువులకు ఆ వ్యాధి సోకగానే వెంటనే పశువైద్య సిబ్బందికి తెలియజేయాలన్నారు. 173 పశువులకు చికిత్స చేసి పిడుదుల నివారణ మందు, డీవార్మింగ్ మందు పిచికారీ చేశారు.గర్భకోశ వ్యాధి చికిత్సలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కెరీర్ లక్ష్యాలను నిర్దేశించుకోవాలి



ఉపాధి పుస్తకాలతో విద్యార్థులు, అధికారుల బృందం

పుత్తూరు: విద్యార్థులు తమ కెరీర్ లక్ష్యాలను నిర్దేశించుకొని అందుకు తగ్గ కృషి చేయాలని తిరుపతికి చెందిన వే ఫౌండేషన్ చైర్‌పర్సన్ డాక్టర్ పైడి అంకయ్య సూచించారు. మంగళవారం స్థానిక ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కెరీర్ గైడెన్స్, కౌన్సిలింగ్ సెల్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సుకు ముఖ్య అతిథులుగా అంకయ్య, జూనియర్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధి రత్నకిషోర్‌లు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ నేటి ఆధునిక సమాజంలో ఉత్పత్తి, సేవా రంగాలలో అనేక అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఫైనాన్స్, అకౌంటింగ్, మార్కెటింగ్, హ్యూమన్ రీసోర్స్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ వంటి విభిన్న రంగాలలో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు తమ తమ బలహీనతలను గుర్తించి, వాటిని అధిగమిస్తూ అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. ఈ సందర్భంగా పరీక్షా ఫలితాల్లో కళాశాలలో తొలి రెండు స్థానాలు సాధించే విద్యార్థులకు ఒక లక్ష రూపాయల విలువైన కోచింగ్ ఇవ్వనున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు ఒప్పందం పత్రంలో సంతకాలు చేశారు. విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి, విద్య అవకాశాల సమాచారం కలిగిన పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ బి.చంద్రమౌళి, కన్వీనర్ నాగేశ్వరరావు, సమన్వయ కర్త నరసింహులు, వైస్ ప్రిన్సిపల్స్ కోటేశ్వరయ్య, వీరయ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పశు వైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలి



మందు పిచికారీ చేస్తున్న వెటర్నరీ అసిస్టెంట్ గోపాలకృష్ణ

పాలసముద్రం: మండల పరిధిలో పశువైద్య శాఖ నిర్వహిస్తున్న ఉచిత పశు వైద్య శిబిరాన్ని పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలని పశు వైద్యాధికారి యశస్వి తెలిపారు. సీఎం కండ్రిగలో 30 పాడి పశువులకు గర్భకోశ వ్యాధులకు వైద్య పరీక్షలు చేశారు. సుమారు 50 పశువులకు పిడుదుల నివారణ మందులు పిచికారీ చేశారు. డాక్టర్ యశస్వి మాట్లాడుతూ గాలికుంటు వ్యాధికి ముందస్తు టీకాలు వేసుకోవాలని సూచించారు. కొందరు పాడిపశువులకు పాలు తగ్గిపోతాయని అపోహ పడుతున్నారని చెప్పారు. టీకాలు వేస్తే పాలు తగ్గవని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గాలి మహేష్ బాబు, వెటర్నరీ అసిస్టెంట్ గోపాలకృష్ణ, లోకనాథం, జేవీఓ కృష్ణమూర్తి, గోపాల్ పాల్గొన్నారు.

కెరీర్ ప్లానింగ్‌తో విజయానికి బాటలు



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ డాక్టర్ వేణుగోపాల్

నగరి: కెరీర్ ప్లానింగ్ విజయానికి బాటలు వేస్తుందని ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపల్ వేణుగోపాల్ అన్నారు. మంగళవారం కళాశాలలో కెరీర్ గైడెన్స్ కౌన్సిలింగ్ సెల్ అవగాహన కార్యక్రమానికి ఆయన అధ్యక్షత వహించి ప్రసంగించారు. వే ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పి.అంకయ్య, గుణశేఖర్ ముఖ్యవక్తలుగా వ్యవహరించి కెరీర్ గైడెన్స్‌పై అవగాహన ఏర్పరిచారు. సెల్ కోఆర్డినేటర్ ఎం.రేవతి, ఎకో-క్లబ్ కోఆర్డినేటర్ ఎం.అరుణ కుమారి, వైస్ ప్రిన్సిపల్ ఎం.భాస్కర్ రాజు, అకడమిక్ కో-ఆర్డినేటర్ పి.మహేశ్వరి, బోటనీ లెక్చరర్ ఎం.అరుణకుమారి, ఫిజిక్స్ లెక్చరర్ సుహాసిని, ఇంగ్లిష్ లెక్చరర్ డాక్టర్ ఎం.పంకజ, జేకేసీ ఎఫ్‌టీఎం ఆర్ లాల్ బాషా, కామర్స్ ఫ్యాకల్టీ హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఈడిగలకు మద్యం షాపు మంజూరు

నగరి: ప్రభుత్వం ఈడిగ కులస్తులకు ఇచ్చే మద్యం షాపు నగరి సర్కిల్ పరిధిలోని నగరి మున్సిపాలిటీకి ఒకటి మంజూరైందని ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరెడ్డి అన్నారు. ఈ షాపునకు టెండర్లు ఆహ్వానించామన్నారు. దరఖాస్తుదారులు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ పద్ధతిలో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తుదారుడు చిత్తూరు జిల్లాకు చెందిన ఈడిగ కులస్తుడై ఉండాలని, వారి కులం, ఉప కులం, జన్మ స్థలం సర్టిఫికెట్ పొంది ఉండాలన్నారు. ఫిబ్రవరి 5వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు నగరి స్టేషన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ఏవైనా సందేహాలుంటే కార్యాలయంలో గానీ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ 9440902548, సబ్ ఇన్‌స్పెక్టర్ 8985603531 నెంబర్లకు సంప్రదించాలన్నారు. ఫిబ్రవరి 7వ తేదీ ఉదయం 8 గంటలకు చిత్తూరు, దొడ్డిపల్లిలోని చిత్తూర్ కో-ఆపరేటివ్ షుగర్ ఫ్యాక్టరీ కల్యాణ మండపంలో లాటరీ పద్ధతిలో లబ్ధిదారును ఎంపిక చేస్తామన్నారు.

విజయపురంలో అక్రమ లేఅవుట్



విజయపురంలో ఏర్పాటు చేసిన లేఅవుట్

విజయపురం: మండలంలో అక్రమ లేఅవుట్‌లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అనుమతులు లేకుండా ఇళ్ల స్థలాల లేఅవుట్లు వేస్తున్నారు. మోసపూరిత ప్రకటనలతో ప్రజలను నమ్మించి, ప్లాట్లను విక్రయిస్తున్నారు. విజయపురం పరిధిలో పదుల సంఖ్యలో అక్రమ లేఅవుట్‌లు వేసిన రియల్టర్లు.. వీటిల్లో కొన్నిటికి మాత్రమే అనుమతి కోసం దరఖాస్తు చేసుకున్నట్టు సమాచారం . అనుమతి లేకుండా వెంచర్లు వేస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు అటువైపు కన్నెత్తి అయినా చూడడం లేదు. విజయపురం మండలం పారిశ్రామిక ప్రాంతంగా అభివృద్ధి చెందుతోంది. దీంతో మండలంలో రోజుకో అక్రమ లేఅవుట్ వెలుస్తోంది. మండల కేంద్రం నగరి-కనకమ్మసత్రం రోడ్డు ఆనుకొని భూముల్లో ఒక రియల్ ఎస్టేట్ వ్యాపారి ఎటువంటి అనుమతులు పొందకుండానే వెంచర్ వేసినట్లు తెలిసింది. భూములను వ్యవసాయేతర అవసరాలకు వినియోగించాలంటే నాన్ అగ్రికల్చర్ ల్యాండ్ ట్యాక్స్ చెల్లించాలి. రియల్టర్లతో కుమ్మక్కైన రెవెన్యూ ఉద్యోగులు.. ఆ పన్నును మొక్కుబడిగా వసూలు చేసి చేతులు దులిపేసుకుంటున్నారన్న విమర్శలు గట్టిగా వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా మండల స్థాయి అధికారులు అక్రమ లేఅవుట్‌లపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కల్లు గీత కార్మికులకు మద్యం షాపులు

• అప్లికేషన్ సమర్పణకు ఆఖరు గడువు ఫిబ్రవరి 5
• ఎక్సైజ్ సీఐ మురళీమోహన్



మాట్లాడుతున్న సీఐ మురళీమోహన్

పుత్తూరు: ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని కల్లు గీత కార్మికులకు రెండు మద్యం షాపులు కేటాయించినట్లు ఎక్సైజ్ సీఐ బి.మురళీ మోహన్ తెలిపారు. మంగళవారం మీడియా సమావేశంలో సీఐ మాట్లాడుతూ పుత్తూరు మున్సిపాలిటీకి ఒకటి, నారాయణవనం మండలానికి ఒకటి వంతున షాపులను కేటాయించామన్నారు. పుత్తూరు మున్సిపాలిటీకి గౌడ, నారాయణవనం మండలానికి ఈడిగ కేటగిరీలకు కేటాయించినట్లు వివరించారు. షాపులు కావల్సిన వారు తిరిగి చెల్లించబడని రూ.2 లక్షల దరఖాస్తు ఫీజును చలానా లేక డీడీ రూపంలో చెల్లించాలని, అప్లికేషన్‌తో పాటు క్యాస్ట్, నేటివిటీ సిర్టిఫికెట్లను పుత్తూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌లో ఫిబ్రవరి 5వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు సమర్పించాలని వెల్లడించారు.

హెల్మెట్ భారం కాదు.. భద్రత



హెల్మెట్ ధరించి ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు, షోరూమ్ సిబ్బంది, యువకులు

నగరి: హెల్మెట్ భారం కాదు.. భద్రత అని డీఎస్పీ సయ్యద్ మొహమ్మద్ అజీజ్ అన్నారు. 36వ రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా నగరి పట్టణంలో చేపట్టిన హెల్మెట్ ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం వారితో కలిసి హెల్మెట్ ధరించి ద్విచక్ర వాహనంపై బస్టాండు ప్రాంగణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నుండి బయల్దేరి పట్టణంలోని ప్రధాన మార్గాల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్మెట్ ధారణ 90 శాతం ప్రాణాపాయం నుంచి వాహనదారులను రక్షిస్తుందన్నారు. రోడ్డుపై వెళ్లేటప్పుడు హెల్మెట్ ధరంచి జాగ్రత్తగా బైక్ నడుపుకొంటూ వెళ్లాలన్నారు. కారు నడిపేవాళ్లు సీటు బెల్ట్ పెట్టుకోవడం చాలా ముఖ్యమన్నారు. నగరి మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వాసుదేవరెడ్డి మాట్లాడుతూ ట్రాఫిక్ నియమాలు పాటించడం ప్రతి పౌరుడి బాధ్యతన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ మహేశ్వర్, పోలీసులు, ద్విచక్ర వాహన షోరూమ్‌ల సిబ్బంది, యువకులు పాల్గొన్నారు.

కుశస్థలికి గర్భశోకం

ఉచితంగా ఇసుక తీసుకోవచ్చు మమ్మల్ని అడిగేదెవరు.. ఆపేదెవరు అని ఇసుకాసురులు రెచ్చి పోతున్నారు. అధికారికంగా నాలుగు ట్రిప్పులు.. అనధికారంగా 40 ట్రిప్పులు అంటూ యథేచ్ఛగా ఇసుక తరలింపు జరుగుతోంది. వెనుక నుంచి పచ్చ నేతలు అభయం ఇస్తుండడంతో ఇసుకాసురులు రెచ్చిపోతున్నారు. కొందరు డంపింగ్ చేసి రహస్యంగా తమిళనాడుకు తరలించేస్తున్నారు. ఇళ్ల నిర్మాణాలకు వాడుకునేవారికి మాత్రం అప్పుడు.. ఇప్పుడు ఒకే ధరకే లభ్యమవుతోంది. దీంతో ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామంటూ సీఎం చంద్రబాబు చెబుతున్న మాటలు.. ఉత్తివే అని తేటతెల్లమవుతోంది. – నగరి

• కాసులు కురిపిస్తున్న 'ఉచిత ఇసుక' పథకం
• ఉచితమే అడిగేదెవరు... ఆపేదెవరంటూ రెచ్చిపోతున్న ఇసుకాసురులు
• పరోక్షంగా వారికి అభయ హస్తం ఇస్తున్న పచ్చనేతలు
• ట్రెంచ్ కొడుతున్నా మరోమార్గాన్ని వెతుక్కుంటున్న వైనం
• డంపింగ్ చేసి తమిళనాడుకు తరలింపు

ఇసుక పాలసీని పచ్చనేతలు కుశస్థలి నదిలో నిమజ్జనం చేశారు. పాలకులు, అధికారులు చెబుతున్న మాటలకు క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితికి పొంతన ఉండడం లేదు. పచ్చనేతల అండతో ఇసుకాసురులు విచ్చలవిడిగా వ్యవహరిస్తున్నారు. రేయింబవళ్లు కుశస్థలి నదిని కుళ్లబొడిచేస్తున్నారు. అధికారులు మార్గంలో ట్రెంచ్‌లు కొడుతుంటే మరో మార్గాన్ని వారు అన్వేషించుకుంటున్నారు. నదిలో నీరు ప్రవహిస్తున్నా లోపల నుంచి తవ్వి ఇసుకను తరలించేస్తుండడంతో సమీప గ్రామాలవారు లబోదిబోమంటున్నారు. తెరణి గ్రామం వద్ద స్థానిక యువకులు పలుమార్లు ఇసుక తరలింపు ట్రాక్టర్లను అడ్డుకోవడం, పోలీసులకు సమాచారం అందించి పట్టిస్తున్నా తరలింపునకు క్లెం వేయలేకపోతున్నారు.



కేవీపీఆర్ పేట వద్ద నీటిలోనే ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లు



తెరణి మిట్టపాళెం మధ్య నదిలో ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లు

పేరుకే ఉచితం

ఇసుక ఉచితమంటూ ప్రభుత్వం ప్రగల్భాలు పలుకుతున్నా ఇంటి నిర్మాణం చేసేవారికి మాత్రం ఎలాంటి లాభం కలగడం లేదు. గతంలో ట్రాక్టరు రూ.2500 తరలించుకున్నవారు. ఇప్పుడు కూడా అదే ధరకే ఇసుకను నిర్మాణాలకు తెచ్చుకుంటున్నారు. దీంతో ఉచిత పాలసీ తరలింపుదారులకు తప్ప ఇంటి నిర్మాణం చేపట్టేవారికి ఎలాంటి ప్రయోజనాన్ని చేకూర్చడం లేదని ఇళ్ల నిర్మాణం చేపట్టేవారు ఆరోపిస్తున్నారు.

డంపింగ్ చేసి తమిళనాడుకు తరలింపు

ఊరికే వచ్చే ఇసుకను ఎందుకు వదలిపెట్టాలి దొరికినపుడల్లా తరలింపుదారులు ఇసుకను ఖాళీ స్థలాల్లో డంపింగ్ చేసుకుంటున్నారు. సమయం దొరికినప్పుడు తమిళనాడుకు తరలించి డబ్బులు దండుకుంటున్నారు. ఇలా తమిళనాడుకు తరలించడానికి ముడిపల్లి మార్గంలో హౌసింగ్ కాలనీ వద్ద డంప్ చేసిన ఇసుకను సీఐ మహేశ్వరరెడ్డి రెండు రోజుల క్రితం సీజ్ చేశారు.

వైరల్‌గా వాయిస్ మెసేజ్‌లు

మున్సిపల్ పరిధి కేవీపీఆర్ పేట వద్ద ప్రవహిస్తున్న నది నీటిలో నుంచి ఇసుకను బయటకు తీసి తరలించేస్తుండడాన్ని చూసి చలించిపోయిన ఒక యువకుడు టీడీపీ నేతలు ఇసుక ఉచితమే అందరూ తీసుకోండి ఇసుక అయిపోతుందేమో త్వరపడండి అని సోషల్ మీడియా ద్వారా పెట్టిన వాయిస్ మెసేజ్ పెట్టగా మరో వ్యక్తి అంతకు మించి మా గ్రామంలో తరలించేస్తున్నారంటూ వాయిస్ మెసేజ్ పెట్టడం వైరల్‌గా మారింది.



ముడిపల్లి వద్ద తమిళనాడుకు తరలించడానికి డంప్ చేసిన ఇసుకను సీజ్ చేసిన సీఐ (ఫైల్)

సరిహద్దు మార్గాల్లో ప్రత్యేక నిఘా

సరిహద్దు మార్గాల్లో ప్రత్యేక నిఘా ఉంచాం. ఇసుక తరలింపుపై ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నాం. నిర్మాణాలకు, ప్రభుత్వ పనులకు మినహా వ్యాపార ఉద్దేశంతో ఇసుక తరలిస్తే చర్యలు తప్పవు. ప్రభుత్వ పనులకు కూడా అధికారులు ఇచ్చిన పర్మిట్ల మేరకే ఇసుకను తరలించాలి. ప్రభుత్వ పనుల పేరు చెప్పి వ్యాపారాలు చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం.

\- మహేశ్వర్, సీఐ, నగరి

కూటమిలో కుమ్ములాటలు.. భయాందోళనలో ప్రజలు



జనంపైకి దూసుకొచ్చిన జన సైనికుడి సోదరుడి కారు

కార్వేటినగరం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామాల్లో శాంతి భద్రతలు కొరవడి ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియక గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. గోరంతను కొండంత చేసి నువ్వా.. నేనా అన్నట్లు ఇటు తెలుగు తమ్ముళ్లు.. అటు జనసైనికులు తగ్గేదిలే అంటూ కత్తులు, కర్రలు, రాళ్లతో దాడులు చేసుకుంటున్నారు. ఇదే క్రమంలో మండల పరిధిలోని గంగమాంబాపురం గ్రామంలో మంగళవారం సాయంత్రం ఇలాంటి ఘర్షణ చోటుచేసుకుంది. జనసేన నాయకుడు లోకనాథరెడ్డి ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్నట్లు టీడీపీ నాయకుడు మహేష్ ఫిర్యాదు చేశారు. దీంతో రెవెన్యూ అధికారులు ఆ స్థలం స్వాధీనం చేసుకున్నట్లు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో టీడీపీ నాయకులపై లోకనాథ రెడ్డి ఆవేశానికి లోనయ్యాడు. తమ ఆడబిడ్డలపై అసభ్యంగా ప్రవర్తిస్తున్నారంటూ లోకనాథరెడ్డి టీడీపీ నాయకులపై కత్తులతో దాడికి పాల్పడ్డారు. మరోవైపు లోకనాథ రెడ్డి సోదరుడు ప్రసాద్ సినీ ఫక్కీలో టీడీపీ నాయకులను కారుతో ఢీ కొట్టేందుకు దూసుకెళ్లినట్లు గ్రామస్తులు చెప్పారు. పచ్చని పల్లెలో ఇలాంటి దాడులు, దౌర్జన్యాలు గతంలో ఎన్నడూ చూడలేదని, స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.